సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం। 11। ఏప్రిల్। 2024



బడి బాగుపడేలా..

అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంతో వచ్చే విద్యా సంవత్సరం నాటికి 697 ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చనున్నారు. 8లో



భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు

దేశ భవిష్యత్‌ను నిర్ణయించే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి, బీజేపీ కుట్రలను ఛేదించాలని మంత్రి సీతక్క కోరారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
37° / 23°

వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గుముఖం పడతాయి. రాత్రి వాతావరణం కూడా కాస్త చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు తిరువీధి సేవ



తిరువీధి సేవలో స్వామివారి ఉత్సవమూర్తులు

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి వైభవంగా తిరువీధి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రధాన ఆలయం నుంచి రాజవీధి ద్వారా తాత గుడి సెంటర్ వరకు చేపట్టిన ఈ వేడుకలు భక్తుల కోలాటం, నృత్యాల నడుమ కనుల పండువగా సాగింది. తాతగుడి వద్ద రామయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి లక్ష కుసుమార్చన



అమ్మవారికి లక్ష కుసుమార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : శ్రీదేవి వసంత నవరాత్రోత్సవల్లో భాగంగా శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి బుధవారం లక్ష కుసుమార్చనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నాద నీరాజనం, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారాలు, సూక్త పారాయణం, హోమాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారికి మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం..

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచ టీచర్స్ కాలనీకి చెందిన ఆడబోయిన సాయిబాబా, రేణుకాదేవి దంపతులు రూ.51,116 విరాళం అందజేశారని ఆలయ ఈఓ జి.సుదర్శన్ తెలిపారు. వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

పోలీస్ సిబ్బందికి ఎస్పీ సూచన



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్ రాజ్ సూచించారు. తన కార్యాలయంలో బుధవారం జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల స్టేషన్లలో పనిచేసే అధికారులు మావోయిస్టుల కదలికలపై నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు, అక్కడి పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్)టి.సాయిమనోహర్, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు రూరల్/భద్రాచలం : క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందున బీఆర్‌ఎస్ భద్రాచలం పట్టణ అధ్యక్షుడు అరికెళ్ల తిరుపతిరావును సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ నిబంధనలు, లైన్ దాటితే ఎవరైనా ఉపేక్షించేంది లేదని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి భద్రాచలం పట్టణ నూతన అధ్యక్షుడిని త్వరలోనే నియమిస్తామని వెల్లడించారు. కాగా, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును ఉగాది రోజున ఆయన క్యాంప్ కార్యాలయానికి వెళ్లి కలిసినందుకే తిరుపతిరావుపై వేటు వేశారని ప్రచారం జరుగుతోంది.

నష్టాలపై నజరేది?

సింగరేణి సంస్థ ఉపరితల, భూగర్భ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. అయితే నిర్వహణ లోపాల కారణంగా ప్రతీసారి ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడంలో భూగర్భ గనులు వెనకబడిపోతున్నాయి. ఏటా ఇదే తంతు కొనసాగుతున్నా.. వాటి పనితీరు మెరుగుపరచడంపై అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి భూగర్భ గనుల వెనుకబాటు

- ఉపరితల గనుల ముందంజతో లక్ష్యం చేరుకున్న సంస్థ
- ఓసీలకు కలిసొచ్చిన వర్షాభావ పరిస్థితులు
- ఓపెన్‌కాస్ట్ లాభాలతో యూజీ నష్టాలను భర్తీ చేస్తున్న అధికారులు !



భూగర్భ గనిలో బొగ్గు వెలికితీస్తున్న సింగరేణి కార్మికులు (ఫైల్)

లక్ష్యం చేరుకున్నప్పటికీ..

సింగరేణిలో 24 భూగర్భ(అండర్ గ్రౌండ్), 18 ఉపరితల (ఓపెన్ కాస్ట్) గనులు ఉన్నాయి. వీటి ద్వారా 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భూగర్భ గనుల ద్వారా 8.24 మిలియన్ టన్నులు, ఓసీల ద్వారా 60.73 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. ఉపరిత గనులు నిర్దేశిత లక్ష్యాన్ని మించి 103 శాతం ఉత్పత్తి సాధించగా భూగర్భ గనులు 72 శాతం మేరకు ఉత్పత్తి చేయగలిగాయి. భూగర్భ గనుల్లో జరిగిన ఉత్పత్తి లోటును ఉపరితల గనుల ద్వారా వచ్చిన అదనపు ఉత్పత్తితో భర్తీ చేయగలిగారు. లేదంటే లక్ష్యాన్ని చేరుకోవడంలో మరోసారి సంస్థ విఫలమయ్యేది.

సగానికి పైగా వెనుకంజే..

సంస్థ పరిధిలో మొత్తం 24 భూగర్భ గనులు ఉండగా ఇందులో కేవలం ఐదు గనులే నిర్దేశిత లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేయగలిగాయి. మరో గనిలో 90 శాతానికి పైగా ఉత్పత్తి నమోదైంది. మిగిలిన గనులు లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యాయి. మణుగూరు ఏరియాలోని కొండాపూర్ భూగర్భ గని ఒక్కటే మిగిలిన అన్నింటికంటే మెరుగ్గా 141 శాతం ఉత్పత్తితో ప్రథమ స్థానంలో నిలిచింది. మందమర్రి ఏరియా పరిధిలోని శాంతిఖని అండర్‌గ్రౌండ్ మైన్ 28 శాతం ఉత్పత్తితో చివరి స్థానంలో ఉండగా.. ఆ తర్వాత స్థానంలో కొత్తగూడెం ఏరియాలోని పద్మావతి గని 46 శాతం మేరకే ఉత్పత్తి సాధించగలిగింది. మొత్తంగా సింగరేణి వ్యాప్తంగా నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడంలో అండర్ గ్రౌండ్ మైన్లు 28 శాతం లోటు కనబరిచాయి.

ఆది నుంచీ నష్టాలే..

సింగరేణిలో ఓసీలతో పోల్చితే యూజీ(భూగర్భ) గనులే ఎక్కువ. మ్యాన్ పవర్ విషయంలోనూ ఓసీలతో పోల్చితే యూజీల్లోనే ఎక్కువ మంది ఉన్నారు. కానీ మొత్తం బొగ్గు ఉత్పత్తిలో యూజీల పాత్ర కేవలం 12 శాతంగానే ఉంది. ఇందులోనూ పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని చేరుకోవడంలో సగానికి పైగా గనులు విఫలం అవుతున్నాయి. అత్యధిక కార్మిక శక్తిని వినియోగిస్తూ, ఎక్కువ వ్యయం అవుతున్న భూగర్భ గనుల్లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులపై సంస్థ పాలకవర్గాలు తులనాత్మక అధ్యయనం చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. భూగర్భ గనుల్లో ఉత్పత్తి నష్టాలు తగ్గిస్తూ పని తీరు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోడర్న్ స్టడీస్ జరుగుతున్న దాఖలాలు లేవు. కేవలం యూజీలలో వస్తున్న నష్టాలను ఓసీలతో వస్తున్న లాభాలతో భర్తీ చేస్తూ 'ఆల్ ఈజ్ వెల్' అనే పరిస్థితిని నెలకొల్పడంపైనే అధికార వర్గాలు ఎక్కువ దృష్టి పెడుతున్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కలిసొచ్చిన వర్షాభావం..

ఈ ఆర్థిక సంవత్సర కాలానికి వానాకాలంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉపరితల గనుల్లో ఉత్పత్తికి పెద్దగా ఆటంకాలు ఎదురు కాలేదు. దీంతో ఓపెన్ కాస్ట్ మైన్లలో ఎక్కువ బొగ్గు ఉత్పత్తి జరిగింది. వాస్తవానికి నైనీ, ఇల్లెందు, రామగుండం ఏరియాల్లో ఈ ఏడాదిలో మూడు కొత్త ఓపెన్ కాస్ట్ గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కావాల్సి ఉంది. వీటి ద్వారా కనీసం పది మిలియన్ టన్నులైనా బొగ్గు రావాల్సింది. కానీ ఈ గనులు ప్రారంభం కాకపోవడంతో ఇక్కడి నుంచి ఒక్క బొగ్గు పెళ్ల కూడా బయటకు రాలేదు. అయినప్పటికీ వానాకాలంలో ఏర్పడిన అనుకూలత కారణంగా ఓసీల నుంచి 3 శాతం మేరకు అదనపు ఉత్పత్తి జరిగింది. దీని వల్లే భూగర్భ గనుల్లో వచ్చిన ఉత్పత్తి లోటు భర్తీ అయింది.

నేడు ఈద్ -ఉల్ ఫితర్

- కనిపించిన నెలవంక
- ఈద్గాలో నమాజ్‌కు ఏర్పాట్లు

అశ్వారావుపేట/కొత్తగూడెం టౌన్ : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్(ఈద్ – ఉల్ ఫితర్) పండుగను గురువారం జరుపుకోనున్నారు. బుధవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో ముస్లింలు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నేడు జరగాల్సిన రంజాన్ నమాజ్ కోసం జిల్లా వ్యాప్తంగా ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు ఇక దీక్షలు విరమించనున్నారు. జిల్లాలోని ఈద్గాలు, మసీదుల్లో ఉదయం 9.30 గంటలకు నమాజ్ ప్రారంభం అవుతుంది. ఎక్కువ మంది ఒకేసారి వచ్చినా ఇబ్బంది పడకుండా ఈద్గాల వద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. ఎండాకాలం కావడంతో ఉదయం ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు మంచినీటి సదుపాయంతో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



అశ్వారావుపేటలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాటుచేసిన టెంట్లు

కలెక్టర్, పీఓ రంజాన్ శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/భద్రాచలం : రంజాన్ పర్వదినం సందర్భంగా కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. దాతృత్వం, ధార్మిక చింతన కలయిక పవిత్ర రంజాన్ మాసమని పేర్కొన్నారు. ముస్లింలంతా కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సేమియాలు - విశిష్టత

చండ్రుగొండ : ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ పండుగకు ప్రత్యేక వంటకంగా సేమియాలు చేస్తారు. నాడు దైవప్రవక్త మొహమ్మద్ (స.అ.స) ఈద్ ఉల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనకు వెళ్లే సమయంలో ప్రవక్త సతీమణి ఆయోషా రజిఅల్లాహుతాలా అన్నా.. నెల రోజులపాటు రొట్టెలు చేయగా మిగిలిన పిండి పదార్థాన్ని వేడి పాలల్లో కలిపి ఇస్తారు. అదే సంప్రదాయం ప్రకారం నేటికీ ప్రపంచవ్యాప్తంగా ఈద్ ఉల్ ఫితర్ పండుగ రోజున ముస్లింలు సేమియా పాయసాన్ని ప్రత్యేకంగా చేస్తారు. హిందువులకు కూడా పంపిణీ చేస్తారు.



సేమియాలు విక్రయిస్తున్న వ్యాపారి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అన్నపురెడ్డిపల్లి : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఏఓ బాబూరావు అధికారులను ఆదేశించారు. అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం, గుంపెన కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని కోరారు. తేమ శాతం 17 వచ్చే వరకు ఆరబెట్టి ఏఈఓల వద్ద టోకెన్లు తీసుకోవాలని సూచించారు. తేమ శాతం 17 రాగానే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు టోకెన్లు ఇవ్వాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం పెద్దిరెడ్డిగూడెం రైతువేదికలో డివిజన్ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి పామాయిల్ సాగు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ సాయినారాయణ, ఏఓలు శీలం చంద్రశేఖర్ రెడ్డి, నవీన్, కరుణామయి తదితరులు పాల్గొన్నారు.



తేమశాతాన్ని పరిశీలిస్తున్న బాబూరావు

ముందస్తు చర్యలు చేపడుతున్నాం..



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల, పక్కన అధికారులు

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో తాగునీరు, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతులు తదితర సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సచివాలయం నుంచి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించామని చెప్పారు. ధాన్యం శుభ్రపరిచే, తేమ యంత్రాలు సరిపడా అందుబాటులో ఉంచామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా హమాలీలు, వాహనాలను సిద్ధం చేశామని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వడదెబ్బ నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, ఎస్‌డీఎఫ్ పనులను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో అదనపు మోటార్లు అందుబాటులోకి తేవాలన్నారు. లీకవుతున్న పైప్‌లైన్లను తక్షణమే మరమ్మతు చేయాలని చెప్పారు. మున్సిపాలిటీల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని, కొత్తగూడెంలో సూర్యనారాయణ (7013953071), దుర్గాప్రసాద్ (905905158), ఇల్లెందులో ఫయాజ్ (9505987252), మణుగూరులో నాగయ్య(9963796469), పాల్వంచకు రాజేష్ (9849908225)ను నియమించామని, కంట్రోల్ రూంలకు వచ్చే ఫిర్యాదులపై మూడు గంటల్లోగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 697 పాఠశాలల్లో అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, డీఈఓ వెంకటేశ్వరాచారి, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, డీఏఓ బాబూరావు, ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వరరెడ్డి, అర్జున్‌రావు, విద్యుత్ ఎస్‌ఈ రమేష్, డీపీఓ చంద్రమౌళి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, సివిల్ సప్లై డీఎం త్రినాథ్ బాబు పాల్గొన్నారు.

లక్ష్య సాధన 94.41 శాతమే..

- టార్గెట్ చేరుకోని జిల్లా మార్కెటింగ్ శాఖ
- గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యం రూ.19.20 కోట్లు
- ఆర్జించిన మొత్తం రూ.18.12 కోట్లు
- అగ్రస్థానంలో దమ్మపేట, బూర్గంపాడు మార్కెట్లు



జిల్లా మార్కెటింగ్ కార్యాలయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా మార్కెటింగ్ శాఖ నిర్దేశించుకున్న ఆదాయ వనరుల లక్ష్యంలో 94.41 శాతం సాధించింది. 2023 – 24 ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.19,20,35,000 కాగా మార్చి 31నాటికి రూ.18,12, 93,000 రాబట్టగలిగింది. జిల్లాలో బూర్గంపాడు, దమ్మపేట, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం, చర్ల మార్కెట్ యార్డులతో పాటు గిడ్డంగులు, చెక్‌పోస్టులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, సెస్‌ల రూపంలో మార్కెటింగ్ శాఖకు ఆదాయం సమకూరుతుంది. ఇక జిల్లాలోని ఐదు మార్కెట్లకుగాను దమ్మపేట, బూర్గంపాడు మార్కెట్లు మాత్రమే లక్ష్యం సాధించగలిగాయి. దమ్మపేట మార్కెట్ 134.66 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, బూర్గంపాడు మార్కెట్ 107.39 శాతంతో ద్వితీయస్థానంలో నిలిచింది. మిగిలిన మూడు మార్కెట్‌లు లక్ష్యసాధనలో వెనుకబడ్డాయి.

సాధించిన లక్ష్యాల వివరాలిలా..

బూర్గంపాడు మార్కెట్ యార్డు నిర్దేశిత లక్ష్యం రూ.5.32 కోట్లు కాగా రూ. 5,71,29,000, దమ్మపేట మార్కెట్ యార్డు లక్ష్యం రూ 2.18 కోట్లకు రూ. 2, 93, 56,000 సాధించి లక్ష్యాన్ని అధిగమించాయి. ఇక ఇల్లెందు మార్కెట్‌యార్డు లక్ష్యం రూ 4.55 కోట్లు కాగా రూ. 3,82,53,000 (84.07 శాతం), భద్రాచలం మార్కెట్ రూ 1.66 కోట్లకు రూ.1,32,42,000(79.77 శాతం) కొత్తగూడెం మార్కెట్ రూ. 2.96 కోట్లకు రూ. 2,57,66,000 (87.05 శాతం) చర్ల మార్కెట్ యార్డు వార్షిక లక్ష్యం రూ.2,53,35,000 కాగా, రూ.1,75,47,000 (69.26 శాతం) మాత్రమే సాధించాయి. మొత్తంగా జిల్లా మార్కెటింగ్ శాఖ ఆదాయ లక్ష్యం రూ. 19, 20, 35,000కు రూ. 18, 12, 93,000 (94.41 శాతం) నమోదు చేసుకుంది. ఇవి కాకుండా అదనపు ఆదాయ వనరుల కోసం కొత్తగూడెం మార్కెట్ యార్డు ఆవరణలో అదనపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే భద్రాచలం, కొత్తగూడెం మార్కెట్ యార్డులకు అనుబంధంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా జిల్లా మార్కెటింగ్ శాఖకు అద్దెల రూపంలో ఆదాయం సమకూరుతోంది. సీసీఐ సెస్ రూపంలో చెల్లించాల్సిన మార్కెట్ ఫీజును ఈ ఆర్థిక సంవత్సరంలో 50 శాతం మాత్రమే చెల్లించడంతో లక్ష్యం చేరుకోవడానికి అడ్డుగా మారింది.

ఆదాయ వనరుల పెంపునకు ప్రణాళికలు



జిల్లా మార్కెటింగ్ శాఖ గత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి చేరువలోకి వచ్చింది. భవిష్యత్‌లో మరిన్ని ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– అలీం, జిల్లా మార్కెటింగ్ అధికారి

గత పదేళ్లలో హామీల ఆర్భాటాలే..

- అన్ని సంఘాలతో చర్చించి ఐక్య కార్యాచరణ
- టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి, పక్కన నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు అనుబంధ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటాలు చేస్తామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో ఉద్యోగులకు డీఏ, ఎరియర్స్, జీపీఎఫ్‌కు సంబంధించి సుమారు రూ.5,400కోట్ల బకాయి ఉందన్నారు. వీటిపై గత ప్రభుత్వం హామీలు ఇచ్చినా అమలు చేయలేదని తెలిపారు. అంతేకాక అమలుచేసిన కొన్ని అంశాలనే గొప్పగా చెప్పుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంలో 317 జీఓకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం త్రిసభ్య కమిటీ వేయించుకున్నామని శ్రీనివాసరావు తెలిపారు. అలాగే, మిగతా సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని చెప్పారు. అయితే, కొన్ని సంఘాల మాజీ నాయకులు ప్రస్తుతం ఉద్యోగులకు ఏమి రాలేదని చెబుతుండగా.. గత పదేళ్లలో వారేం చేశారో చెప్పాలని సూచించారు. కాగా, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలతో కలిసి జేఏసీగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని శ్రీనివాసరావు తెలిపారు. ఈసమావేశంలో టీజీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రితో పాటు వివిధ ఉద్యోగ సంఘాల బాధ్యులు సుధారాణి, విజయలక్ష్మి, కృష్ణారావు, పుష్ప, గణేష్, రమణ, కొణిదన శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాస్, తాళ్లూరి శ్రీకాంత్, గంగవరపు బాలకృష్ణ, అబ్దుల్‌హకీం, బిక్కు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని మించిన సంపద లేదు

జిల్లా జడ్జి పాటిల్ వసంత్


కొత్తగూడెంటౌన్: ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టులో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడారు. ఆరోగ్యం ప్రాముఖ్యత తెలియజేసేందుకే ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. పేదరికం, విద్య, సామాజిక చైతన్యంతో పాటు మనం నివసించే ప్రదేశం, భౌతిక వాతావరణం వంటి పలు అంశాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని అన్నారు. అనంతరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గొల్లపూడి భానుమతి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ.. వైద్యులు దేవుడితో సమానమని, కరోనా కష్ట కాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడారని అన్నారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బత్తుల రామారావు, కె.సాయిశ్రీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి, ఏజీపీ ఏవూరి బాబురావు, తోట మల్లేశ్వరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కాస్త ఉపశమనం..

చుంచుపల్లి : గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎండలు మండిపోయాయి. ఈనెల 7న రాష్ట్రంలోనే అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదైన విషయం తెలిసిందే. ఎండల పట్ల తీవ్ర ఆందోళనలో ఉన్న జిల్లా వాసులకు రెండు రోజులుగా కాస్త ఉపశమనం లభించింది. జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు తగ్గింది. దీనికి తోడు రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎండల ధాటితో మంగళవారం వరకు ఆరంజ్ జోన్‌లో ఉన్న జిల్లా బుధవారం ఎల్లో జోన్‌లోకి వచ్చింది. వర్ష సూచనల నేపథ్యంలో మరో రెండు, మూడు రోజులు ఉష్ణోగ్రత మరింత తగ్గుతుందని భావిస్తున్నారు.



ఈనెల ఒకటి నుంచి జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్ట ఉష్ణోగ్రత
1	41.3
2	42.7
3	42.8
4	42.1
5	42.8
6	43.4
7	44.5
8	43.6
9	40.9
10	40.0

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలకు 'సింగరేణి' సామగ్రి



జీఎం కార్యాలయానికి చేరిన బీరువాలు

మణుగూరు టౌన్‌: సింగరేణి కాలరీస్‌ పరిధి మణుగూరు ఏరియాలోని ప్రభావిత గ్రామాల ప్రభుత్వ పాఠశాలలకు యాజమాన్యం సామగ్రి సమకూరుస్తోంది. పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు సీఎస్‌ఆర్‌(కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబులిటీ) కింద ఇప్పటికే స్వీకరించిన నివేదికల ఆధారంగా రూ.13.50 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో పాఠశాలలకు కావాల్సిన బల్లలు, బీరువాలు, బెంచ్‌లు, డెస్క్‌లు, కంప్యూటర్లు కొనుగోలు చేశారు. వీటిని త్వరలోనే ప్రభుత్వ విద్యాసంస్థలకు అందజేయనున్నారు.

ఆదివాసీ గ్రామాల్లో బోర్లకు అంగీకారం

చిరుతానిపాడు, పెద్దకలన గిరిజన గ్రామాలను సందర్శించిన అధికారులు



చిరుతానిపాడులో గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

పాల్వంచరూరల్‌: వేసవిలో తాగునీటి కోసం తల్లడిల్లుతున్న ఆదివాసీ గ్రామాలను ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఫారెస్ట్‌ వైల్డ్‌లైఫ్‌ చాతకొండ రేంజర్‌ శ్రీనివాసరెడ్డి బుధవారం సందర్శించారు. మండల పరిధిలోని బంజర పంచాయతీ చిరుతానిపాడు, ఉల్వనూరు పంచాయతీ పెద్దకలస ఆదివాసీ గ్రామాలను అధికారులు సందర్శించి గిరిజనులతో సమావేశమయ్యారు. తాగునీటి ఎద్దడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బోర్లు వేయాలని గిరిజనులు వేడుకోవడంతో స్పందించిన ఎంపీడీఓ వైల్డ్‌లైఫ్‌ శాఖ అధికారులతో మాట్లాడారు. రెండు గ్రామాల్లో తాగునీటి బోర్లు వేసేందుకు అంగీకరించడంతో గిరిజనులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి



కుమారుడు సురేష్‌ మృతి చెందడంతో రోదిస్తున్న తల్లి సోమ్రి

భద్రాచలం(భద్రాచలం అర్బన్‌): ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం భీమారం గ్రామానికి చెందిన ఏడాది బాలుడు సురేష్‌ అనారోగ్య కారణాలతో భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మలేరియా, రక్తం తక్కువ ఉండటం, గుండె సమస్యతో అనారోగ్యం బారినపడగా శుక్రవారం తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచనల మేరకు స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో గుండె సంబంధిత పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో బాలుడు మృతి చెందాడు. కాగా ఏరియా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే సురేష్‌ మృతి చెందాడని ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. ఈ విషయంపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రామకృష్ణతో పాటు చిన్న పిల్లల వైద్యులను వివరణ కోరగా.. బాలుడు పుట్టుకతోనే గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడని, మలేరియా, రక్తహీనత కూడా ఉందని తెలిపారు. చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం లేదని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ సీజ్‌

ఇల్లెందు: అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు సీజ్‌ చేశారు. పట్టణంలోని కరెంటాఫీఎస్‌ వద్ద వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు టేకులపల్లి వైపు నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన సాంబశివరావు అనే వ్యక్తికి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి ఎస్‌ఐ సందీప్‌ కేసు నమోదు చేశారు.

మట్టి టిప్పర్‌..

పాల్వంచరూరల్‌: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ వాహనాన్ని పోలీసులు బుధవారం సీజ్‌ చేశారు. మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామం నుంచి పాల్వంచ వైపునకు అనుమతులు లేకుండా మట్టి తరలిస్తుండగా టిప్పర్‌ వాహనాన్ని హెడ్‌కానిస్టేబుల్‌ శ్రీరాములు పట్టుకున్నారు. డ్రైవర్‌ కేసరి వీరభద్రం, యజమాని వాసిరెడ్డి మధులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్‌ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

దుమ్ముగూడెం: మండల పరిధిలోని కాశీనగరం గ్రామ శివానేలె పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్‌ చేశారు. రూ.1,550 నగదు, రెండు మోటార్‌ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ గణేష్‌ తెలిపారు.

పామాయిల్‌ గెలలు



టన్ను ధర	రూ.14,174

బడి బాగుపడేలా...

- అమ్మ ఆదర్శ పాఠశాలల పథకానికి 697 స్కూళ్ల ఎంపిక
- పనుల ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్న కమిటీలు
- విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక
- డీఎంఎఫ్‌, ఎస్‌డీఎఫ్‌ నిధులతో సౌకర్యాల కల్పన



అమ్మ ఆదర్శ పథకానికి ఎంపికైన కొత్తగూడెంలోని కూలీలైన్‌ ఉన్నత పాఠశాల

కొత్తగూడెంఅర్బన్‌: అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శవంతంగా రూపుదిద్దుకోనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు–మన బడి కింద ఎంపిక చేసిన పాఠశాలలు కాకుండా నూతనంగా 697 పాఠశాలలను ఈ పథకానికి ఎంపిక చేశారు. వాటిల్లో పనులు చేపట్టి సౌకర్యాలు కల్పించనున్నారు. యూడైస్‌లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల ఎంపిక చేపట్టగా, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు కలెక్టర్‌ పలుమార్లు విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా టాయిలెట్స్‌, ఫ్యాన్లు, బల్లాలు, విద్యుత్‌, తాగునీటి తదితర సమస్యలను హెచ్‌ఎంలు, ఇటీవల నియమితులైన కమిటీ సభ్యులు గుర్తించి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. వర్షాకాలంలో పాఠశాల ఆవరణల్లో వర్షపు నీరు నిల్వకుండా ఉండేందుకు, వర్షపు నీరు తరగతి గదుల్లో రాకుండా మరమ్మతులు చేపట్టనున్నారు. వానాకాలంలో మధ్యాహ్న భోజనానికి వంట చేసేందుకు ఇబ్బందులు లేకుండా.. వంట గదుల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టనున్నారు. మన ఊరు–మన బడి పథకంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శవంతంగా రూపుదిద్దుకోగా, ప్రస్తుతం అమలు చేస్తున్న పథకంతో సర్కారు స్కూళ్లు ప్రైవేటుకు దీటుగా తయారు కానున్నాయి. దీనివల్ల వచ్చే ఏడాది విద్యార్థుల అడ్మిషన్లు సైతం పెరిగే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు.

రూ. 22 కోట్లతో పనులు

డీఎంఎఫ్‌, ఎస్‌డీఎఫ్‌ నిధుల నుంచి రూ.22 కోట్లతో పనులు చేపట్టనున్నారు. అమ్మ ఆదర్శ పథకంలో అత్యధికంగా ఇల్లెందులో 55 పాఠశాలలు, అత్యల్పంగా భద్రాచలంలో 8 పాఠశాలలు ఎంపికయ్యాయి. మన ఊరు–మన బడి పథకం కింద జిల్లాలోని కొన్ని మండలాల్లో పాఠశాలలు ఆదర్శవంతంగా రూపుదిద్దుకున్నా, మరికొన్ని మండలాల్లోని పాఠశాలల్లో పనులు ఇంకా కొనసాగుతున్నాయి. అమ్మ ఆదర్శ పథకం పనులు సకాలంలో పూర్తయితే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సౌకర్యవంతంగా ఉండే అవకాశం ఉంది.

సదుపాయాలు సమకూరుతాయి..



జిల్లాలో అమ్మ ఆదర్శ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఇంజనీరింగ్‌ అధికారులు స్కూళ్లను సందర్శించి అంచనాలు తయారు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి అన్ని పనులు పూర్తవుతాయి. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పాఠశాలలు సౌకర్యవంతంగా మారుతాయి.

–వెంకటేశ్వరచారి, జిల్లా విద్యాధికారి

350 పాఠశాలల్లో ప్రతిపాదనలు సిద్ధం

అమ్మ ఆదర్శ పాఠశాలల పథకానికి 697 పాఠశాలలను ఎంపిక చేయగా, ఇప్పటివరకు 350 పాఠశాలల్లో పనుల ప్రతిపాదనలు పూర్తి చేశారు. మిగతా పాఠశాలల్లో కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇంజనీరింగ్‌ విభాగంలోని ఏఈలు, సిబ్బంది పాఠశాలలను సందర్శించి పనులకు సంబంధించిన పరిశీలనలు చేస్తున్నారు. ప్రతిపాదనలలో పనులు ఎప్పుడు మొదలుపెట్టే విషయం, ఎప్పుడు పూర్తి చేసే విషయాలను సైతం పొందుపర్చి సమర్పించనున్నారు. అన్ని పాఠశాలల్లో పనులను మే 31వ తేదీ వరకు పూర్తి చేయించాలని విద్యాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. వచ్చే నెలలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో రానున్న 15 రోజుల్లో ఎన్నికల పోలింగ్‌ కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో తాగునీరు, ఎలక్ట్రికల్‌, టాయిలెట్స్‌ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్‌ ఆదేశించారు.

ఇవి దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు..



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్యే పాయం, అభ్యర్థి బలరాంనాయక్‌, నాయకులు

- కుట్రలను ఛేదించి కాంగ్రెస్‌ను గెలిపిద్దాం
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

మణుగూరు టౌన్‌: దేశ గౌరవ పతాకగా నిలిచిన రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పేలా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించనున్న ఈ ఎన్నికల్లో బీజేపీ కుట్రలను ఛేదించాలని కోరారు. మణుగూరు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్‌ లోక్‌సభ కాంగ్రెస్‌ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ శ్రేణులను ఉద్దేశించి సీతక్క మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చే నాటికి ఉన్న పరిస్థితులను సరిదిద్దేలా కాంగ్రెస్‌ అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రధాని మోదీ, ఇటు మాజీ సీఎం కేసీఆర్‌ చెబుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలు రాగానే సైనికుల సమస్యలు, దేశ రక్షణ తదితర అంశాల పేరిట మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప దేశం కోసం బీజేపీ చేసిందేమిటో చెప్పాలని సూచించారు. అయితే, కాంగ్రెస్‌ మాత్రం అటవీ హక్కుల చట్టం, అసైన్డ్‌ భూములు పంపిణీ, ఉపాధి హామీ పథకాలను తీసుకొచ్చి ప్రజల మేలు కోసం పాటుపడిందని తెలిపారు. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన బలరాం నాయక్‌ మచ్చలేని నాయకుడని, ఆయనను మరోమారు ఎంపీగా గెలిపించి దేశం బాగు కోసం పరితపిస్తున్న రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేయడంలో కాంగ్రెస్‌ శ్రేణులు, ప్రజలు కీలకపాత్ర పోషించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్‌ఎస్‌ అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి రూపాయి కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు సమష్టి కృషితో నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తూ బలరాం నాయక్‌ విజయానికి సహకరించాలని కోరారు. అభ్యర్థి బలరాం నాయక్‌ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ హయాంలో పినపాక నియోజకవర్గంలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. తన హయాంలో చేసిన అభివృద్ధి పనులే తప్ప కొత్తవి కనిపించడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్‌ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు బట్టా విజయ్‌గాంధీ, కాటబోయిన నాగేశ్వరరావు, పీరినాకి నవీన్‌, గొడిశాల రామనాథం, సయ్యద్‌ ఇక్బాల్‌ హుస్సేన్‌, దుర్గంపూడి కృష్ణారెడ్డి, ఆరిఫ్‌ పాషా, పాతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సౌజన్య, బషీరుద్దీన్‌, సామాశ్రీనివాసరెడ్డి, గణేశ్‌రెడ్డి, గాండ్ల సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి సీతక్క వ్యక్తిగత సహాయకుడు బండారి సతీష్‌ తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మణుగూరులోని ఆయన నివాసంలో నివాళులర్పించడంతో పాటు కుటుంబీకులను పరామర్శించారు.

శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతం చేయాలి

దుమ్ముగూడెం: అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ మండలంలోని పర్ణశాల శ్రీ సీతారాచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ ఎల్‌.రమాదేవి సూచించారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఎండల తీవ్రంగా ఉన్న నేపథ్యాన భక్తులకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని, శానిటేషన్‌, విద్యుత్‌ సరఫరా, వైద్యచికిత్సకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం ఉత్సవాల వివరాలతో రూపొందించిన పోస్టర్లను ఈఓ, అధికారులు ఆవిష్కరించారు. ఆతర్వాత దేవస్థానం ఆధ్వర్యాన ఉచిత మజ్జిగ పంపిణీని ఈఓ రమాదేవి ప్రారంభించారు. ఎండల నేపథ్యాన భక్తులు ఇబ్బంది పడకుండా ఉచితంగా మజ్జిగ అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ ముత్యాలరావు, ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్‌, ఉత్సవాల ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌, వివిధ శాఖల అధికారులు గణేష్‌, మధుసూదన్‌రావు, శ్రీనివాసరావు, ఆదినారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఉచిత మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న ఈఓ

ఎండోమెంట్‌ ట్రిబ్యునల్‌ జడ్జి పూజలు

దుమ్ముగూడెం/చర్ల: పర్ణశాలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని తెలంగాణ దేవాదాయ శాఖ ట్రిబ్యునల్‌ జడ్జి మండా వెంకటేశ్వరరావు కుటుంబసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా.. స్వామిదర్శనం అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతం విశిష్టతను తెలుసుకున్నారు. ఆతర్వాత జడ్జి కుటుంబ సభ్యులు చర్ల మండలం తేగడలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారిని సైతం దర్శించుకున్నారు. అర్చకులు శ్రావణ్‌కుమార్‌, భానుప్రకాష్‌, న్యాయవాది ముత్యాల రామచంద్రయ్య పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరలో భక్తుల రద్దీ

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జారే



సతీమణితో కలిసి టాయ్‌ ట్రెయిన్‌లో ఎమ్మెల్యే ఆదినారాయణ



శ్రీ తలుపులమ్మ తల్లి అలంకరణలో అమ్మవారు

అశ్వారావుపేటరూరల్‌: మండలంలోని వినాయకపురంలో ఉన్న శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి జాతర కొనసాగుతోంది. ఉత్సవాలు ఐదో రోజుకు చేరుకోగా, బుధవారం అమ్మవారు శ్రీ తలుపులమ్మ అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే, అమ్మవారికి అర్చకులు సుప్రభాత సేవ, అర్చనలు, చండీ పారాయణం, కుంకుమపూజ నిర్వహించారు. కాగా, జాతరకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే జాతర ప్రాంగణంలో తిరుగుతూ భక్తులు, వ్యాపారులను పలకరించారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన జాయింట్‌ వీల్‌, రైలు ఎక్కి సరదాగా గడిపారు. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా, హైదారాబాద్‌, నల్లగొండ జిల్లాలతోపాటు ఏపీలోని పశ్చిమ గోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకాగా జాతర ప్రాంగణం రద్దీగా మారింది. ప్రధాన రహదారి పక్కనే ఉత్సవాలు కొనసాగుతుండడంతో గంటల కొద్ది ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను సిబ్బంది చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

ముగిసిన కోటమైసమ్మ జాతర

కామేపల్లి: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని కొత్తలింగాలలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీ కోటమైసమ్మతల్లి జాతర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజు అర్చకులు పూజారి పుల్లయ్యశర్మ, ఫణిశర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ అధికారులు ఆర్‌.సమత, నల్లమోతు శేషయ్య సమక్షాన లెక్కించారు. ఈమేరకు కానుకల ద్వారా రూ.50,382, పూజ టికెట్ల అమ్మకంతో రూ.12 వేల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈకార్యక్రమంలో జూనియర్‌ అసిస్టెంట్‌ వరప్రసాద్‌, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, గింజల నర్సింహారెడ్డి, రెడబోతు గోపీరెడ్డి, తోటకూరి శ్రీనివాసరావు, శంకరయ్య, కిరణ్‌బాబు, వీరయ్య, చైతన్య పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్‌ వేణుగోపాల్‌



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ వేణుగోపాల్‌

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): ఓపెన్‌ పదో తరగతి, ఓపెన్‌ ఇంటర్‌ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్‌ వేణుగోపాల్‌ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు దఫాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు జిల్లాలో మూడు సెంటర్లలో 846 మంది, ఇంటర్మీడియట్‌ పరీక్షలకు నాలుగు కేంద్రాల్లో 978 మంది హాజరు కానున్నారని వివరించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ విధించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమీపంలోని జిరాక్స్‌ సెంటర్లను మూసివేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా ఇంటర్మీడియట్‌ అధికారి సులోచనారాణి, పోలీస్‌, వైద్య, పోస్టల్‌, విద్యుత్‌, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం

మహబూబాబాద్‌ లోక్‌సభ అభ్యర్థి సీతారాంనాయక్‌



గుండాల : నర్సాపురం తండాలో మాట్లాడుతున్న సీతారాంనాయక్‌

కరకగూడెం/గుండాల: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పార్టీ మహబూబాబాద్‌ లోక్‌సభ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్‌ వెల్లడించారు. కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో బుధవారం పర్యటించిన ఆయన పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సీతారాంనాయక్‌ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. ఈమేరకు మరోసారి ప్రజలు బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యాన మహబూబాబాద్‌ నుంచి తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి చురుగ్గా సాగుతుందని తెలిపారు. తెలంగాణ కోసం పోరాడిన వారిలో తాను మొదటి స్థానంలో ఉండగా.. 2014లో ఎంపీగా గెలిచినప్పుడు అనేక అభివృద్ధి పనులు మంజూరు చేయించానని తెలిపారు. ఏకలవ్య పాఠశాలలు, గిరిజన యూనివర్సిటీ తీసుకొచ్చిన తనను మరోమారు గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని సీతారాంనాయక్‌ చెప్పారు. ఈ సమావేశాల్లో బీజేపీ నాయకులు కృష్ణవేణి, బిక్షపతి, సమ్మయ్య, ఐలయ్య, శ్రీరాం చంద్రయ్య, శివ ప్రసాద్‌, సోలం సతీష్‌, శ్రీనివాసాచారి, ఇర్ప ప్రకాష్‌, ఉదయ్‌, వెంకటేశ్వర్లు, వీరస్వామి, నర్సింహారావు, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్‌ మేనేజర్‌ మోసం రూ.5కోట్లకు పైగానే..

- సీసీఎస్‌లోనూ కేసు నమోదు, విచారణ

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ బ్యాంకు మేనేజర్‌ అక్రమంగా ఖాతాదారుల నగదును దారి మళ్లించిన ఘటనపై ఖమ్మం వన్‌టౌన్‌ పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదుకాగా.. సీసీఎస్‌ పోలీసులు సైతం మేనేజర్‌ రామకృష్ణపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటివరకు అందిన ఫిర్యాదుల ఆధారంగా సదరు మేనేజర్‌ రూ.2.40కోట్ల మేర ఖాతాదారుల నగదు వాడుకున్నట్లు తెలుస్తుండగా.. అందరూ బయటకు వస్తే 5కోట్లకు పైగా మోసం బయటపడే అవకాశముందని సమాచారం. విదేశాల్లో చదువుకుంటున్న పిల్లల కోసం పలువురు సదరు బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. అయితే, నిబంధనల మేరకు ముందస్తు చెక్కులు ఇచ్చిన వారు విదేశాల్లోని యూనివర్సిటీలు సూచించినప్పుడు మాత్రమే ఖాతాల నంచి నగదు పంపిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న సదరు బ్యాంకు మేనేజర్‌ ఆ చెక్కుల ఆధారంగా రూ.2.40కోట్ల మేర నగదును తనతో పాటు కుటుంబీకులు, బంధువుల ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఇప్పటివరకు 20మందికి పైగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో పలువురు బుధవారం సైతం పోలీస్‌ స్టేషన్‌కు రాగా.. పోలీసు శాఖలోని ఓ హెడ్‌ కానిస్టేబుల్‌ సైతం రూ.15లక్షల నగదు కోల్పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా, పోలీసులు విచారణలో భాగంగా బ్యాంక్‌ మేనేజర్‌ రామకృష్ణతోపాటు ఆయన భార్య, తల్లిదండ్రులు, సోదరులపై సైతం కేసు నమోదు చేసి వారి బ్యాంక్‌ ఖాతాలను పరిశీలిస్తున్నారు. ఇక సదరు బ్యాంక్‌ ఉన్నతాధికారులు సైతం ఖమ్మం చేరుకుని ఉద్యోగులను ఆరా తీసినట్లు తెలిసింది.

ఆర్టీసీ బస్సు ఆపి ఆకతాయిల హల్‌చల్‌

డ్రైవర్‌ను దుర్భాషలాడి, అడ్డువచ్చిన ప్రయాణికుడిపై దాడి



ఎస్‌ఐకి సమస్య వివరిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

జూలూరుపాడు : మండలంలోని మాచినేనిపేటతండాకు చెందిన ఆకతాయిలు బుధవారం గ్రామంలోనే ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సును ఆపి, డ్రైవర్‌ను దుర్భాషలాడారు. నలుగురు యువకులు నడిరోడ్డుపై బైక్‌లు ఆపి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. అదే సమయంలో ఖమ్మం నుంచి వస్తున్న భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును నిలిపివేశారు. దీంతో డ్రైవర్‌ జి.శ్రీనివాస్‌ ప్రశ్నించగా భూక్యా వినోద్‌, లకావత్‌ గణేష్‌, లకావత్‌ శశికుమార్‌, గుగులోత్‌ విజయ్‌ కుమార్‌ బస్సులోకి ప్రవేశించి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు యత్నించగా, ప్రయాణికులు అడ్డుకున్నారు. దీంతో మధుసూదన్‌బాబు అనే ప్రయాణికుడిపై దాడి చేసి, అతని చొక్కా చింపివేశారు. బస్సు అద్దాలు కూడా ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నలుగురు ఆకతాయిలను అదుపులోకి తీసుకుని, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించారు. ఎస్‌ఐ జీవన్‌ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఫైనాన్స్‌ వేధింపుల కేసులో ఐదుగురి అరెస్ట్‌

ఖమ్మంఅర్బన్‌: ద్విచక్ర వాహనంపై తీసుకున్న రుణం చెల్లించాలని వెంట పడి తరుముతుండగా, యువకుడు చెరువులో పడి మృతి చెందిన ఘటనలో ఐదుగురిని పోలీసులు బుధవారం అరెస్ట్‌ చేశారు. యూపీకి చెందిన మార్బుల్‌ వర్కర్‌ వినయ్‌ ద్విచక్ర వాహనంపై తీసుకున్న ఫైనాన్స్‌ రూ.4వేల బకాయి ఉండగా నాలుగు రోజుల క్రితం ఆయనను ఆటోఫైనాన్స్‌ సంస్థ రికవరీ ఏజెంట్లు వేధించారు. ఈక్రమంలో కర్రలు, రాళ్లతో దాడి చేస్తున్న ఏజెంట్ల నుంచి తప్పించుకునేందుకు వినయ్‌ పరుగులు తీస్తూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటనలో ఆటో ఫైనాన్స్‌ సంస్థ యజమాని సైదారావుతో పాటు రికవరీ ఏజెంట్లు రాంచందర్‌, అజయ్‌కుమార్‌, ఇంటి యజమాని ఎస్‌.రవి, మేస్త్రీ శ్రీనును అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం అర్బన్‌ పోలీసులు తెలిపారు.